https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 15 శనివారం 9-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# ఏడాదిన్నరలో కృష్ణా జలాలు

## రెండు నెలల్లో వికారాబాద్-కృష్ణా రైల్వే లైను

- టేకుల్‌కోడ్ వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం
- లగచర్ల పార్కుకు పెద్ద పెద్ద పరిశ్రమలు
- 'కొడంగల్'ను బంగారు తునక చేసుకుందాం
- నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- కొడంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్
- 3 ఆలయాల పునరుద్ధరణ, 430 పడకల ఆస్పత్రి
- నిర్మాణ పనులకు మంత్రులతో కలిసి భూమిపూజ



**వికారాబాద్, మే 8**
"పెద్ద కుర్చీయే ఉంది. ఏ పని కావాలన్నా చేసుకోవచ్చు. రెండేళ్లలో కొడంగల్ నియోజకవర్గాన్ని బంగారు తునకలా.. దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిన్నరలోపు పూర్తి చేసి కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకు వస్తామని చెప్పారు. ఈ పథకం పనులు వేగవంతం చేసేందుకు భూసేకరణ బాధ్యతను మంత్రి శ్రీహరికి అప్పగిస్తే నెల రోజుల్లోనే 98 శాతం పూర్తి చే శారన్నారు. ఎత్తిపోతల పథకానికి ఇక ఎలాంటి అడ్డంకులు లేవని, ఎప్పుడంటే అప్పుడు నిధులు మంజూరు చేస్తామని, కొడంగల్ భూములు కృష్ణా జలాలతో తడవాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కొడంగల్‌లో రూ.110 కోట్లతో శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సీఎం రేవంత్ శుక్రవారం భూమి పూజ చేశారు. దౌల్తాబాద్‌లో రూ.2.16 కోట్లతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గిలో రూ.2 కోట్లతో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం, హకీంపేట్‌లో రూ.255 కోట్లతో నిర్మించనున్న 430 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు ఆయన అక్కడే భూమి పూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. "కొడంగల్ నుంచి అనేక మంది వలసలు పోయారు. ఇది రాష్ట్రంలోనే ఎత్తయిన ప్రాంతం. నీళ్లు వచ్చే అవకాశం లేదు. కందులు తప్ప వడ్లు పండించే పరిస్థితి లేదు. ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టుకోలేని అమాయకత్వం కొడంగల్ ప్రజలది. ఇప్పుడు దేశంలో అభివృద్ధి చెందిన నియోజకవర్గాన్ని ఎవరైనా చూడాలనుకుంటే కొడంగల్‌కు వెళ్లి రావాలనిపించేలా.. ఇతరులు అసూయ పడేలా అభివృద్ధి చేసుకుందాం" అని పిలుపునిచ్చారు. వికారాబాద్ రైల్వే లైన్ ప్రక్రియ 90 శాతం పూర్తయిందని, మరో రెండు నెలల్లో రైల్వే లైన్ పనులు కూడా ప్రారంభం కానున్నాయని చెప్పారు. కొడంగల్ ప్రాంతంలో సున్నపు రాయి నిక్షేపాలు అధికంగా ఉన్నాయని, ఆరు నెలల్లో టేకుల్‌కోడ్ వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కాబోతోందని, తద్వారా ఎంతో మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. రెండేళ్లలో దేశంలోని పెద్ద, పెద్ద పరిశ్రమలు లగచర్ల మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు రానున్నాయని, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి కోస్గి వరకు 330 ఫీట్ల రహదారి నిర్మాణం జరగనుందని చెప్పారు. కొడంగల్ ప్రాంతం ఇప్పుడు ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని, లగచర్ల వద్ద 220 ఎకరాలను కేటాయిస్తున్నామని తెలిపారు. మెడికల్, ఇంజనీరింగ్, నర్సింగ్ కాలేజీలు, పాలిటెక్నిక్, సైనిక్ స్కూల్ వంటి విద్యా సంస్థలు కొడంగల్‌లో ఏర్పాటవుతున్నాయని, ఉన్నత చదువులకు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు కొడంగల్‌కు వచ్చేలా చేస్తున్నామని చెప్పారు. అన్ని అభివృద్ధి పనులను 2027 డిసెంబరుకు పూర్తి చేయాల్సిందేనని అధికారులను ఆదేశించారు. కొడంగల్‌లోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలకు కూడా పేదల తిరుపతిగా పేరుగాంచిందని గుర్తు చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగం కావడం తన జన్మలో మళ్లీ రాని అవకాశమని, ఈ దేవాలయం పేరు ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి పునర్నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. తిరుపతిలో ఏ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తారో అదే సంప్రదాయం ప్రకారం కొడంగల్ దేవాలయంలో పూజలు కొనసాగాలని స్పష్టం చేశారు.

# బెంగాల్ సీఎం.. సువేందు

- బీజేపీఎల్పీ నేతగా ఎన్నిక
- ప్రకటించిన అమిత్ షా
- గవర్నర్‌ను కలిసిన సువేందు
- నేడు కోల్‌కతాలో ప్రమాణం
- హాజరు కానున్న ప్రధాని మోదీ



**కోల్‌కతా, మే 8:**
పదిహేనేళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగట?(స‌ను ఓడించి పశ్చిమబెంగాల్‌లో విజయం సాధించినబీజేపీ.. సువేందు అధికారిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకటించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో.. పార్టీ సీనియర్ నేత, బెంగాల్‌లో బీజేపీ మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ సువేందు అధికారి పేరును ప్రతిపాదించారు. ఈ భేటీకి కేంద్రహోం మంత్రి అమిత్ షా పరిశీలకుడిగా, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ సహ పరిశీలకుడిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం.. పశ్చిమబెంగాల్ బీజేపీ శాసన సభా పక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికైనట్టు అమిత్ షా ప్రకటించారు. రాష్ట్రంలో కమ్యూనిస్టుల పాలనలో ఏర్పడిన భయానక వాతావరణం మమత హయాంలో మరింత దారుణంగా తయారైందని.. ఓటు వేయడమే అసాధ్యంగా మారిన పరిస్థితి ఏర్పడిందని.. అలాంటి పరిస్థితుల్లో బీజేపీని, తమ నాయకుడు నరేంద్ర మోదీని నమ్మి, ఇంతటి ఘనవిజయాన్ని అందించిన పశ్చిమ బెంగాల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. "ఇది శామాప్రసాద్ ముఖర్జీ ప్రభుత్వం" అని పేర్కొన్నారు. సువేందు అధికారి కూడా భావోద్వేగంతో.. 'ఇది భోయ్ అవుట్ భరోసా ఇన్ సమయం' అని వ్యాఖ్యానించారు. 'భయం పోయి నమ్మకం రావాలి' అనే సమయం వచ్చిందని దీని అర్థం. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో తొలిసారిగా పశ్చిమ బెంగాల్‌ను అధికా రంలోకి తెచ్చిన అమిత్ షాను.. ఆధునిక భారతంలో అభినవ చాణక్యుడిగా అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ నాయకుడు నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారని.. వాటిన్నింటినీ నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కాగా.. శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన రెండు గంటల్లోపే .. సువేందు అధికారి బెంగాల్ గవ ర్నర్ ఆర్ఎన్ రవిని కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరారు. ఇక.. కోల్‌కతాలోని చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం ఉదయం 11 గంటలకు సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయ నున్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

# మోదీ సభతో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు!

- 2, 3 నెలల్లోనే మార్పులు చూస్తారు
- మోదీ సభను విజయవంతం చేయండి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపు
- మోదీతో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం రేవంత్



**హైద్రాబాద్,మే 8**
రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులకు ప్రధాని మోదీ పర్యటన అంకురార్పణ చేయబోతోందని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆయన పర్యటన తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయని అంటున్నారు. అది కూడా రెండుమూడు నెలల్లోనే జరగబోతోందని పేర్కొంటున్నారు. వ్యూహాత్మకంగానే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో మోదీ బహిరంగసభను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. బెంగాల్‌లో పార్టీ విజయ బావుటా ఎగురవేయబోతున్నట్లు స్పష్టత వచ్చిన రోజే తెలంగాణలో సభను ఖరారు చేసినట్లు ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు చెప్పారు. అస్సాం, బెంగాల్‌లో సాధించిన విజయ పరంపరను తెలంగాణలో కొనసాగించేందుకు అంతర్గత కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. 'రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు అనుసరించబోయే కార్యాచరణలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ దశలవారీగా పర్యటించబోతున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో పాటు పార్టీ అగ్రనాయకులు విస్తృత పర్యటనలు చేయబోతున్నారు. ఇక్కడ పార్టీ కార్యక్రమాలను అగ్రనాయకులు స్వయంగా పర్యవేక్షించనున్నారు' అని పార్టీ కీలక నేత ఒకరు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే సభలో ప్రధాని పాల్గొంటారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో దాదాపు రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.40 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. హెచ్ఐసీసీలో జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచే జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ, ఎన్‌హెచ్–167 విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కు (వరంగల్)తో పాటు మల్కాపూర్ గ్రీన్‌ఫీల్డ్ పెట్రో టెర్మినల్‌ను ప్రారంభిస్తారు.

# క్షేత్రస్థాయికి కలెక్టర్లు..

- ఇక ప్రతి శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డే
- నెలలో 4 రోజులు నియోజకవర్గంలోనే..
- ప్రజాప్రతినిధులనూ కలుపుకొని పోండి
- దీనికోసం ఒకే రోజుకు వీసీలు కుదింపు
- బ్రాండ్.. ప్రజా విశ్వాసం.. రెండూ ముఖ్యమే
- టెక్నాలజీకి అలవాటుపడి సున్నితత్వం కరువు
- మంత్రులు సహా అందరి పనితీరు మారాల్సిందే
- ఫైళ్ల క్లియరెన్స్ కాల వ్యవధి బాగా తగ్గాలి
- రెండు రోజుల్లో అర్జీ డిస్పోజ్ కావాల్సిందే
- ఏం కావాలో తీసుకోండి.. ఫలితాలు చూపండి
- కలెక్టర్లకు తేల్చిచెప్పిన సీఎం చంద్రబాబు



**అమరావతి, మే 8**
ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లే, ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో అర్జీలు స్వీకరించాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆరోజును ఫీల్డ్ గ్రీవెన్స్ డేగా ఆయన ప్రకటించారు. టెక్నాలజీకి బాగా అలవాటుపడిపోవడంతో అధికారుల్లో మానవ సున్నితత్వం కొరవడుతోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఏపీకి బ్రాండ్ రావడంతోపాటు ప్రజల్లో విశ్వాసం పెరగడం కూడా ముఖ్యమేనని రెండురోజుల సదస్సులో కలెక్టర్లకు, మంత్రులకు ఆయన దిశానిర్దేశం చేశారు. "ఫిర్యాదుల విషయంలో సింగపూర్ మోడల్‌ను అనుసరించాలి. నియోజకవర్గాల సందర్శనలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేసుకోండి.." అని స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ కోసం ప్రజాదర్బార్‌లాంటి ఓ వేదికను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. నియోజకవర్గాల సందర్శనను కలెక్టర్లకు తప్పనిసరి చేస్తున్నామని అన్నారు. "ఒక నియోజకవర్గాన్ని ఎంచుకుని నెలలో నాలుగుసార్లు సందర్శించాలి. సమస్యల పరిష్కారానికి కలెక్టర్లే క్షేత్రస్థాయికి వెళ్లాలి. దీనికోసం వీడియోకాన్ఫరెన్సులు ఇకపై ఒక్క రోజుకు పరిమితం చేద్దాం." అని సీఎం తెలిపారు. ఫిర్యాదును డిస్పోజ్ చేసే పద్ధతి మారాల్సిందేనన్నారు. "కొంత మంది 20, 30 రోజులు వారి వద్ద పెట్టుకుని చివరరోజున ఏదో ఒక అధికారికి పంపించి ఫిర్యాదును డిస్పోజ్ చేస్తున్నారు. అది సరికాదు. ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించుకుని అర్జీలను వేగంగా పరిష్కరించాలి. ఒకే తరహా ఫిర్యాదులు పదేపదే వస్తుంటే, ఫిర్యాదుదారును పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాలి" అన్నారు. డిసెంబరు నాటికి వంద శాతం ప్రభుత్వ సేవలు వాట్స్?ప్‌లో అందించేలా చూడాలని సీఎం నిర్దేశించారు. రాష్ట్రంలో 34 శాతం కుటుంబాలకు స్మార్ట్‌ఫోన్లు లేవని అధికారులు తెలపగా, వారందరికి ఏ విధంగా ఫోన్ సౌకర్యం కల్పించాలో ఆలోచించాలని మంత్రి లోకేశ్‌కు సూచించారు.

# జలాల పేరిట బీఆర్ఎస్ దోపిడీ

- ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు.. ప్రాజెక్టుల పేర కమీషన్లు దండుకున్నారు
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో కవిత



**షాద్‌నగర్, మే 8 :**
"ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు దండుకున్న బీఆర్ఎస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుల పేరిట కమీషన్లు దండుకుంది. పదేళ్ల అధికారంలో జలాల పేరుతో దోపిడీకి పాల్పడింది. అంతే తప్ప.. పాలమూరు– రంగారెడ్డి జిల్లాలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదు. కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. ప్రాజెక్టుల పేరుతో ఓ గుంటనక్క కమీషన్లు మింగేసింది. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై డిజైన్లను మార్పు చేసింది" అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి కనీసం 33 ఎకరాలకు కూడా సాగు నీరు అందించలేదని దుయ్యబట్టారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్– చౌదరిగూడ మండల కేంద్రంలో శుక్రవారం 'రంగారెడ్డి– పాలమూరు ప్రాజెక్టు సాధన సభ'ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. "జూరాల నుంచి కృష్ణా జలాలను వాడుకునేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి చివరి ఆశాకిరణం కిరణ్‌కుమార్‌రెడ్డి జీవో నంబరు 72 ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ బేషజాలకు పోయి సోర్స్ పాయింట్‌ను శ్రీశైలానికి మార్చింది. క్షమించరాని నేరం చేసింది. పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజల ఆశలను బొంద పెట్టింది. అప్రోచ్ చానల్ 140 మీటర్లు ఉండాల్సి ఉంటే.. 50 మీటర్లకు కుదించింది. ఓ గుంటనక్క కమీషన్ల కోసం ఇదంతా చేసింది" అని మండిపడ్డారు. కమీషన్ల కోసం నీళ్లు తీసుకునే ఎత్తును కూడా పెంచడం దుర్మార్గమన్నారు. సోర్స్ పాయింట్‌ను శ్రీశైలానికి మార్చడం ద్వారా మనకు ఆంధ్రోళ్లతో పంచాయితీ అవుతోందన్నారు. ఈ 12 ఏళ్లలో కృష్ణా నది నుంచి పాలమూరు ఆయకట్టుకు చుక్క నీరు అందించలేదని, రాష్ట్రంలో ఇతర ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇలానే ఉందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదన్నారు. స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన ప్రతి ఒక్కరూ రాబోయే రోజుల్లో నీటి యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు కింద 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే రంగారెడ్డి జిల్లాలో 4 లక్షలు, మహబూబ్‌నగర్ జిల్లాలో 7 లక్షల ఎకరాలకు నీళ్లు అందించవచ్చన్నారు. ఈ పనులను దసరాలోపు ప్రారంభించకపోతే పాదయాత్ర చేసి కాంగ్రెస్ ను ఎండగడతామని హెచ్చరించారు.

# అస్సాం సీఎంగా హిమాంత 12న ప్రమాణ స్వీకారం



**గువాహటి, మే 8:**
అస్సాం ముఖ్యమంత్రిగా హిమాంత బిశ్వశర్మ ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన సీఎం పదవి చేపట్టనుండడం వరుసగా రెండోసారి కావడం విశేషం. అంతకుముందు బీజేపీ లెజిస్లేచర్ పార్టీ ఈ నెల 10న సమావేశమయి నాయకుడిని ఎన్నుకోనుంది. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం లాంఛనప్రాయమే కానుంది. అనంతరం ఆయన పేరును ఆమోదిస్తూ మిత్ర పక్షాలైన బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్, అసోం గణపరిషత్‌లు తీర్మానాలు చేయనున్నాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాతోపాటు, ఎన్‌డీఏ కూటమి ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు.

# మాజీ రక్షణ మంత్రులకు మరణశిక్ష

**అవినీతి కేసులో చైనా కోర్టు సంచలన తీర్పు**

**లంచాల ఆరోపణలపై కఠిన చర్యలు**

**జిన్‌పింగ్ అవినీతి వ్యతిరేక పోరుకు మరో మలుపు**



**బీజింగ్, మే 8 :**
చైనాలో అవినీతి వ్యతిరేక చర్యలు మరింత కఠినంగా మారుతున్నాయి. దేశ మాజీ రక్షణ మంత్రులు వి ఫెంగీ, లీ షాంగ్‌ఫూకు చైనా మిలిటరీ కోర్టు మరణశిక్ష విధించడం అంతర్జాతీయంగా సంచలనంగా మారింది. అయితే రెండు సంవత్సరాల పాటు ఎటువంటి నేరానికి పాల్పడకుండా ఉంటే వారి శిక్షను జీవిత ఖైదుగా మార్చనున్నట్లు కోర్టు పేర్కొంది. అవినీతి కేసులో విచారణ అనంతరం ఈ తీర్పు వెలువడింది. వి ఫెంగీ లంచాలు తీసుకున్నట్లు, లీ షాంగ్‌ఫూ లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు బలంగా ఉన్నాయని భావించిన కోర్టు కఠిన శిక్ష విధించినట్లు సమాచారం. చైనా రక్షణ వ్యవస్థలో ఉన్న అత్యున్నత స్థాయి అధికారులపై ఇలాంటి చర్యలు తీసుకోవడం అక్కడి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ 2014 నుంచి అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని తీవ్రంగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ మిలిటరీ అధికారులు, రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక దర్యాప్తులు నిర్వహిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటికే పలువురు ఉన్నతాధికారులు పదవులు కోల్పోగా, మరికొందరు జైలుశిక్షలు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో చైనా మిలిటరీ నాయకత్వంలో కూడా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో 11 మంది సభ్యులతో శక్తివంతంగా ఉన్న సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో ప్రస్తుతం సభ్యుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. జిన్‌పింగ్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలతో చైనా సైన్యంలో క్రమశిక్షణ పెరుగుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అవినీతి వ్యతిరేక చర్యల కారణంగా జిన్‌పింగ్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మాజీ రక్షణ మంత్రులు వి ఫెంగీ, లీ షాంగ్‌ఫూలతో జిన్‌పింగ్‌కు రాజకీయ విభేదాలు ఉన్నాయా అన్న అంశంపై మాత్రం స్పష్టత లేదు. ప్రస్తుతం ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

# ఢిల్లీ, హర్యానాలో ఉగ్రదాడుల కుట్ర భగ్నం

**ఐఎస్ఐ లక్ష్యంగా ఆలయం, మిలిటరీ క్యాంప్, దాబా**

**సోషల్‌మీడియా ద్వారా పాక్ హ్యాండ్లర్లకు సమాచారం**

**షహజాద్ భట్ మాడ్యూల్‌తో సంబంధాల వెలుగులోకి**



**న్యూఢిల్లీ, మే 8**
దేశ రాజధాని ఢిల్లీతో పాటు హర్యానాలో భారీ ఉగ్రదాడులకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ కుట్ర పన్నిన విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ--సోనిపట్ హైవేపై ఉన్న ప్రముఖ దాబా, హర్యానాలోని మిలిటరీ క్యాంప్, ఢిల్లీలోని ఓ ప్రముఖ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడుల ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ కుట్రను షహజాద్ భట్ మాడ్యూల్‌కు చెందిన ఆపరేటివ్‌ల ద్వారా అమలు చేయాలని ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ మాడ్యూల్‌కు సంబంధం ఉన్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ అధికారులు నిందితులను విచారించగా కీలక సమాచారం బయటపడినట్లు తెలుస్తోంది. పోలీసుల సమాచారం ప్రకారం.. నిందితుల్లో ఒకరు ఢిల్లీలోని ప్రముఖ ఆలయం వద్ద రెక్కీ నిర్వహించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది కదలికలు, పరిసర ప్రాంతాల ఫొటోలను సోషల్‌మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్‌లో ఉన్న హ్యాండ్లర్లకు పంపినట్లు అధికారులు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా ఉగ్రదాడుల ప్రణాళిక సిద్ధం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఆలయం వద్ద మోహరించిన భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపి భయాందోళనలు సృష్టించాలని కుట్ర పన్నినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకుని దేశంలో అశాంతి సృష్టించడమే ఉద్దేశ్యంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ, హర్యానాలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ కేసులో ఇంకా మరికొంత మంది ప్రమేయం ఉన్న అవకాశం ఉందని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. దేశ భద్రతకు ముప్పు కలిగించే కుట్రలను ముందుగానే భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అరెస్టైన నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వ ఏర్పాటుపై చిదంబరం వ్యాఖ్యలు

**విజయ్‌కు అవకాశం ఇవ్వాలని గవర్నర్‌కు సూచన**

**అసెంబ్లీలోనే మెజారిటీ నిరూపణ**



**చెన్నై, మే 8:**
తమిళనాడు రాజకీయాల్లో కొనసాగుతున్న ఉత్కంఠ మధ్య కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న ఏకైక పార్టీ నాయకుడినే ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాల్సిన బాధ్యత గవర్నర్‌దని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో టీవీకే పార్టీ అధినేత విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆహ్వానించాలని సూచించారు. ఈ మేరకు పి. చిదంబరం సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో స్పందించారు. ఏ రాజకీయ కూటమికీ లేదా ఒక్క పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాని పరిస్థితుల్లో గవర్నర్ రాజ్యాంగ పరమైన విధులు ఎలా ఉండాలనే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. శాసనసభలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీ నాయకుడిని ముందుగా ప్రభుత్వం ఏర్పాటు చేయమని పిలవడం రాజకీయ సంప్రదాయం అని పేర్కొన్నారు. అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీకి మెజారిటీ మద్దతు ఉందో లేదో నిరూపించుకోవాల్సిన వేదిక అసెంబ్లీనే తప్ప గవర్నర్ భవనం కాదని చిదంబరం స్పష్టం చేశారు. ఇది కేవలం రాజకీయ నియమం మాత్రమే కాకుండా పార్లమెంటరీ సంప్రదాయం కూడా అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను కూడా గుర్తు చేశారు. ప్రస్తుతం తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు అంశంపై తీవ్ర రాజకీయ చర్చ కొనసాగుతోంది. టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, ఇతర పార్టీలు తమ రాజకీయ వ్యూహాలపై దృష్టి పెట్టాయి. ఇదే సమయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసే అవకాశాలపై కూడా ప్రచారం సాగుతోంది. ఈ పరిస్థితుల్లో పి. చిదంబరం చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గవర్నర్ తీసుకునే తదుపరి నిర్ణయంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## తల్లి ఆత్మహత్యాయత్నం.. ఊపిరాడక ఇద్దరు చిన్నారుల మృతి

**మూసి ఉన్న గదిలో పొగలు కమ్ముకోవడంతో విషాదం**

**చికిత్స పొందుతున్న తల్లి**

**కుటుంబ కలహాల కోణంలో దర్యాప్తు**



**లక్నో, మే 8**
ఉత్తరప్రదేశ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తల్లి ఆత్మహత్యాయత్నం చేయడంతో గదిలో పొగలు వ్యాపించి, ఊపిరాడక ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన షామ్లీ జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. కైరానా ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల అనిత గురువారం ఇంట్లోని బెడ్‌రూమ్‌లో నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గది తలుపులు మూసి ఉండటంతో కొద్ది సేపట్లోనే పొగలు దట్టంగా వ్యాపించాయి. ఆ సమయంలో గదిలో ఉన్న ఆమె కుమార్తెలు పదేళ్ల వందన, ఏడాదిన్నర వయసున్న జస్‌ప్రీత్ తీవ్రంగా పొగ పీల్చడంతో స్పృహ కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాలిన గాయాలతో ఉన్న అనితతో పాటు స్పృహ కోల్పోయిన ఇద్దరు చిన్నారులను ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం కోసం తరలించారు. అనిత ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని అధికారులు వెల్లడించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఘటన సమయంలో ఆమె భర్త జస్సీ ఇంట్లో లేదని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగానే అనిత ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు**

**- పోలీస్ వ్యవస్థను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆరోపణ**

**- ప్రజల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్**

**హైదరాబాద్, మే 8**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న నేర ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగాన్ని రాజకీయ కక్షసాధింపులకు, ప్రతిపక్ష నాయకులను వేధించడానికి వినియోగిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల భద్రత, రక్షణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని అన్నారు. శాంతిభద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే హైదరాబాద్ ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్యకు గురవడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అదే విధంగా సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై యువకుడిని కత్తితో పొడిచి చంపిన ఘటన ప్రజల్లో భయాందోళనలు పెంచిందని అన్నారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతున్న అభద్రతా పరిస్థితులకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. నేరాల నియంత్రణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వాన్ని విమర్శించే సోషల్ మీడియా వేదికలపై కేసులు పెట్టడానికి వినియోగిస్తోందని ఆరోపించారు. పోలీస్ వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకోవడం వల్లే శాంతిభద్రతలు కుప్పకూలాయని కేటీఆర్ అన్నారు. మహిళలపై నేరాలు, సైబర్ నేరాలు రాష్ట్రంలో భారీగా పెరిగాయని తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలను ప్రస్తావించారు. హోంశాఖను కూడా తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రాజకీయ వేధింపులు ఆపి పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో భరోసా కల్పించేలా పోలీసులు వృత్తిపరంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

# హంతా వైరస్‌పై ప్రపంచ అప్రమత్తం

**శరవేగంగా వ్యాపిస్తున్న హంతా వైరస్**

**డచ్ క్రూయిజ్ షిప్‌లో ముగ్గురు మృతి**

**ప్రపంచ దేశాలతో కలిసి పని చేస్తున్న డబ్ల్యూహెచ్ఓ**



**జెనీవా, మే 8**
ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ మహమ్మారి తర్వాత ఇప్పుడు హంతా వైరస్ మరోసారి అంతర్జాతీయ ఆందోళనకు కారణమవుతోంది. ఇటీవల డచ్ క్రూయిజ్ షిప్ "ఎంవీ హోండియస్"లో హంతా వైరస్ కేసులు బయటపడటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. ఈ వైరస్‌కు సంబంధించిన కేసులు పలు దేశాల్లో నమోదవుతున్న నేపథ్యంలో సభ్య దేశాలను జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం.. ప్రస్తుతం హంతా వైరస్‌కు సంబంధించిన ఐదు నిర్ధారిత కేసులు, మరికొన్ని అనుమానిత కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ వైరస్ బారినపడి ఇప్పటికే ముగ్గురు మృతి చెందినట్లు వెల్లడించింది. మరణించిన వారిలో డచ్ దంపతులతో పాటు జర్మనీకి చెందిన వ్యక్తి ఉన్నట్లు సమాచారం. ఈ వైరస్ వ్యాప్తికి కేంద్రంగా మారిన డచ్ క్రూయిజ్ షిప్‌లో మొత్తం 23 దేశాలకు చెందిన 149 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వైరస్ బయటపడకముందే కొందరు ప్రయాణికులు వివిధ దేశాలకు వెళ్లిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంస్థలు కాంటాక్ట్ ట్రేసింగ్ చేపట్టాయి. హంతా వైరస్ సాధారణంగా ఎలుకల మూత్రం, లాలాజలం, విసర్జన ద్వారా వ్యాపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనలో గుర్తించిన "ఆండీస్" రకం వైరస్ వ్యక్తి నుంచి వ్యక్తికి కూడా వ్యాపించే అవకాశం ఉండటంతో ఆందోళనలు పెరిగాయి. అయినప్పటికీ సాధారణ ప్రజలకు ప్రస్తుతం ముప్పు తక్కువగానే ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. వైరస్ నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ వివిధ దేశాలతో కలిసి పనిచేస్తోంది. బాధితులతో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచుతున్నారు. క్రూయిజ్ షిప్‌ను ప్రత్యేక నియంత్రణలో ఉంచి వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. హంతా వైరస్ లక్షణాలు మొదట జ్వరం, శరీర నొప్పులు, అలసట రూపంలో కనిపించి తర్వాత తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు దారితీయవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దీనికి ప్రత్యేక వ్యాక్సిన్ లేకపోవడంతో ముందస్తు జాగ్రత్తలే కీలకమని ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి.

# అనుభవ లేమి.. అవగాహన ఏదీ?

**విజయ్ తీరుపై విశ్లేషకుల్లో చర్చ**
**మద్దతు కోరుతూ వాట్సాప్ లెటర్**
**గవర్నర్‌కూ అదే రీతిలో సమాచారం**
**రంగంలోకి ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఎంట్రీ**
**మెత్తబడిన సీపీఐ, సీపీఎం, వీసీకే**




**చెన్నై, మే 8 :**
రెండేళ్ల క్రితం ఆవిర్భవించి, తొలి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొన్న టీవీకే పార్టీ.. తాజా ఫలితాల్లో అధికారానికి స్వల్పదూరాన నిలిచిపోయి, 4 రోజుల నుంచి 6 సీట్ల మద్దతు సాధించలేక నానా తంటాలు పడింది. దీనికి ఆ పార్టీ అనుభవరాహిత్యమే ప్రధానంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తొలిరోజునే తమ కూటమిలోకి చేర్చుకోవాలని భావించిన పార్టీల అధినేతలతో టీవీకే నేతలు నేరుగా భేటీ అయి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. కానీ, ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు కోరుతూ 'కామన్ లెటర్' సిద్ధం చేసి, ఆయా పార్టీల నేతలకు టీవీకే వాట్సాప్ చేసింది. దీంతో టీవీకేకి తామంటే లెక్కలేదన్న భావనతో ఆయా పార్టీల నేతలు మౌనంగా ఉండిపోయారు. అయితే, పరిస్థితి చేయిదాటుతోందని గ్రహించి.. గురువారం సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీల నేతలను టీవీకే నేతలు నేరుగా కలిసి మద్దతు కోరారు. అప్పటి నుంచే ఆయా పార్టీలు మద్దతు గురించి ఆలోచించడం ప్రారంభించాయి. తమకు మద్దతు ఇచ్చే పార్టీలేవి?.. ఆయా పార్టీలతో భావసారూప్యత ఉందా?.. బలాబలాలేంటి?.. అన్న అంశమే ప్రస్తావించకుండా ఏదో నాలుగు పార్టీలకు లేఖ పంపించాం.. అవే వచ్చేస్తాయన్న ధీమాతోనే విజయ్ ఉండిపోయారు. పార్టీలను కూడగట్టడంలో విజయ్ కనీసం కాంగ్రెస్ సహకారం కూడా తీసుకోలేదని తెలిసింది. కానీ, గవర్నర్ రెండుసార్లు తిరస్కరించడం, పరిస్థితి చేయిదాటుతుండడంతో చివరి నిమిషంలో కాంగ్రెస్ సాయం కోరినట్లు సమాచారం. తమిళనాట విజయ్‌కు మద్దతిచ్చే పార్టీ కానరాకపోవడంతో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఆయనే స్వయంగా సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీల నేతలతో మాట్లాడారు. ఆ తర్వాత ఆయా పార్టీల నేతలు మెత్తబడినట్లు విశ్వసనీయ సమాచారం. నిజానికి అన్నాడీఎంకే నుంచి టీవీకేలో చేరిన కేఏ సెంగోట్టయ్యన్‌కు మాత్రమే రాజకీయ, పాలనాపరమైన అనుభవం ఉంది. మరో పదిమంది గతంలో అసెంబ్లీకి వెళ్లిన వారు ఉన్నారు. మిగిలిన వారంతా కొత్త నేతలే కావడంతో టీవీకేలో అనుభవరాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపించింది.

**గవర్నర్‌కు ఈ-మెయిల్**
గవర్నర్ వ్యవహారంలో కూడా టీవీకే నిర్లక్ష్యం కనిపించింది. సహజంగా ఎన్నికల ఫలితాలు వచ్చాక.. అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ శాసనసభాపక్షం సమావేశమై తమ నేతను ఎన్నుకుంటుంది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత నేరుగా లోక్‌భవన్‌కు వెళ్లి ఆ విషయాన్ని గవర్నర్‌కు వివరిస్తారు. గవర్నర్ లేనిపక్షంలో ఆయన కార్యదర్శికి అయినా లేఖ అందిస్తారు. అనంతరం పార్టీ అధినేత లోక్‌భవన్‌కు వెళ్లి అధికారికంగా తమ ఎమ్మెల్యేల జాబితాతో కూడిన లేఖను గవర్నర్‌కు అందజేస్తారు. కానీ, టీవీకే మాత్రం గవర్నర్‌కు ఈ-మెయిల్ ద్వారా లేఖ పంపించింది. దాంతో గవర్నర్ కార్యాలయం కూడా అదే రీతిలో స్పందించింది. రెండుసార్లు విజయ్ గవర్నర్‌ను కలుసుకున్న తరువాత.. లోక్‌భవన్‌లో ఏం జరిగిందో చెప్పే వారే లేకుండా పోయారు. దీంతో మీడియా కూడా తమకు తోచింది ప్రచారం చేసింది. ఆఖరికి లోక్‌భవన్.. గవర్నర్ ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని అడిగారని ప్రకటన జారీ చేస్తే గానీ.. లోపల ఏం జరిగిందో తెలియలేదు.

**మద్దతు కోసం వాట్సాప్ లేఖా?: వీసీకే**
ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు కోరుతూ టీవీకే నేతలు వాట్స్?పలో లేఖ పంపించారని, ఇదేం సంప్రదాయమని వీసీకే ప్రధాన కార్యదర్శి చిందనై సెల్వన్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తగిన మద్దతు లభించదని తెలిపోయాకే టీవీకే నేతలు నేరుగా తమ వద్దకు వచ్చి మద్దతు కోరారని తెలిపారు.

# కేరళ సీఎం వేణుగోపాల్?

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఆయన వైపే!**
**ఖర్గేకు పార్టీ పరిశీలకుల నివేదిక**
**11న ప్రమాణ స్వీకారం?**
**రేసులో సతీశన్, చెన్నితల**
**మిత్రపక్షాల ఓటు సతీశన్‌కే**



**తిరువనంతపురం/న్యూఢిల్లీ, మే 8:**
కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ కేరళ సీఎం రేసులో ముందంజలో ఉన్నారు. ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ ఆధ్వర్యంలో గురువారం తిరువనంతపురంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో.. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు వేణుగోపాల్‌కే ఓటేసినట్లు తెలిసింది. పరిశీలకులు శుక్రవారం ఢిల్లీలో ఖర్గేకు తమ నివేదిక సమర్పించారు. అంతా సాఫీగా జరిగితే 11నసోమ వారం వేణుగోపాల్ సీఎంగా పదవీప్రమాణం చేస్తారని విశ్వసనీయ సమాచారం. అయితే ఇదంత తేలికగా కనిపించడం లేదు. ఎందుకంటే ఈ పదవి కోసం కాంగ్రెస్ సీనియర్ల మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. గత ఐదేళ్లు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పనిచేసిన వీడీ సతీశన్.. అంతకుముందు ఐదేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్న రమేశ్ చెన్నితల సీఎం కుర్చీ ఆశిస్తున్నారు. ఇటీవలి ఎన్నికల్లో 140 స్థానాల అసెంబ్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 102 స్థానాలు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ వాటా 63. ఐయూఎంఎల్(22), కేరళ కాంగ్రెస్(7) సహా మిగతా మిత్రపక్షాలు 39 సీట్లు గెలుచుకున్నాయి. సీఎల్పీ భేటీలో 63 మంది ఎమ్మెల్యేల్లో 43 మంది వేణుగోపాల్ వైపు మొగ్గుచూపినట్లు తెలిసింది. ఈలోపు సతీశన్ వర్గీయులు రోడ్లెక్కారు. రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు దిగారు. సోషల్ మీడియాలో ప్రత్యర్థులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. అటు వేణుగోపాల్ మద్దతుదారులు పీసీసీ కార్యాలయం ముందు సీఎం వేణుగోపాల్ అంటూ భారీ ఫ్లెక్సీలే పెట్టేశారు. ఇతరుల క్యాబినెట్‌లో తాను చేరనని.. ముఖ్యమంత్రి పదవి తప్ప మరేదీ తీసుకోనని.. సాధారణ ఎమ్మెల్యేగానే ఉంటానని సతీశన్ అధిష్ఠానానికి తేల్చిచెప్పినట్లు తెలిసింది. మిత్రపక్షాలు సైతం ఆయన్నే సీఎంగా కోరుకుంటున్నాయి. సోనియాగాంధీకి సన్నిహితుడిగా పేరున్న చెన్నితల చాపకింద నీరులా తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. దీంతో సతీశన్, చెన్నితలకు అధిష్ఠానం నచ్చజెబుతున్నట్లు తెలిసింది. మిత్రపక్షాలతో కూడా సంప్రదింపులు జరిపాకే సీఎం అభ్యర్థిని ప్రకటించి 11న ప్రమాణ స్వీకారం చేయించాలని భావిస్తోంది. మధ్యేమార్గంగా మాజీ సీఎం కరుణాకరన్ కుమారుడు కె.కరుణాకరన్ సైతం తెరపైకి వచ్చే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. కాగా, సీఎల్పీ భేటీలో అందరు ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకోలేదని.. వేణుగోపాల్ అభ్యర్థిత్వానికి మద్దతు అడిగారని ప్రత్యర్థి వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇదిలా ఉండగా, తిరువనంతపురంలోని కేరళ పీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నేత చెరియన్ ఫిలి?ప ఎమ్మెల్యే బిందు కృష్ణను కౌగిలించుకునే ప్రయత్నం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## హత్యకు వారం రోజులుగా రెక్కీ

**యావన్‌ను చంపిన యువతి బావ, అన్న**

**బౌద్ధనగర్, మే 8**
చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగిన బీటెక్ విద్యార్థి బొమ్మన యావన్ అలియాస్ అఖిల్(23) హత్య పథకం ప్రకారమే జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. యావన్ ప్రేమించిన యువతి బంధువులు వారం నుంచి హత్యకు పథకం వేసినట్లు వెల్లడైంది. జవహర్‌నగర్‌కు చెందిన యావన్, మేడిబావికి చెందిన యువతి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. యావన్ తరచూ మేడిబావికి వచ్చి తన పెద్దమ్మ ఇంట్లో ఉంటూ స్నేహితులను కలిసేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి 9గంటల సమయంలో ఇందిరానగర్‌కాలనీ రోడ్డునెంబర్-5లో యావన్ తన స్నేహితులతో కలిసి ఓ ఇంటి అరుగుపై కూర్చొని ఉండగా.. బైక్‌లపై వచ్చిన ఆరుగురు యువకులు యావన్‌తో వాగ్వాదానికి దిగి, కత్తులతో దాడి చేసి పరారయ్యారు. యావన్‌ను వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హత్యచేసిన తర్వాత నిందితులు యావన్ ఫొటోపై 'ఫుల్ మర్డర్' అని రాసి స్నాప్‌చాట్‌లో పోస్టు చేయడంతో పోలీసులు రంగంలో దిగారు. యువతి బావ సాయి, సోదరుడు పరమేశ్ ప్రధాన సూత్రధారులని విచారణలో గుర్తించారు. యావన్‌పై యువతితో పోలీస్ కేసు పెట్టించేందుకు ఆమె కుటుంబసభ్యులు ప్రయత్నించినట్లు, లేదంటే ఇద్దరినీ చంపేస్తామని ఆమె బావ సాయి హెచ్చరించినట్లు ఓ ఆడియో కాల్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. "నీపై పోలీసు కేసుపెట్టాలని ఇంట్లో ఒత్తిడి చేస్తున్నారు. కాలేజీకి వెళ్లకు.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి టార్చర్ చేస్తున్నాడని చెప్పు అంటున్నారు. ఇదంతా మా బావ ప్లానే. మేం ఫిర్యాదు రాస్తాం, నువ్వు వచ్చి సంతకం పెట్టాలన్నాడు. లేదా ఇద్దరినీ చంపేస్తానని మా బావ అంటున్నాడు" అని యువతి పేర్కొన్నట్టుగా అందులో ఉంది.

## 20 నాటికి అండమాన్‌కు 'నైరుతి'



**న్యూఢిల్లీ, మే 8:**
ఈ నెల 20వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకొచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. రెండవ వారం చివరకు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాల్లో రుతుపవనాల ప్రవేశం జరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ఏడాది రుతుపవన సీజన్ (జూన్-సెప్టెంబరు)లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఇది దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో 92 శాతంగా ఉంటుందని ఐఎండీ ఇంతకు ముందటి అంచనాల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రధాన పంటల నాట్లు వేసే కాలంలో పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామం వినియోగం, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాగా, బంగాళాఖాతం నుంచి ఈశాన్య భారతదేశం వరకు దిగువ, మధ్య ట్రోపోస్ఫెరిక్ స్థాయిల్లో ఈ వారంలో నైరుతి గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. మొత్తంగా.. దక్షిణాది రాష్ట్రాలు, తూర్పు, ఈశాన్య భారతంలో సాధారణం కంటే అధిక వర్షపాతం, పశ్చిమ హిమాలయన్ రీజియన్‌లో సాధారణం కంటే తక్కువ, దేశంలోని మిగతా చోట్ల దాదాపు సాధారణ వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. రైతులు కీలకమైన ఖరీఫ్ సీజన్‌లో వరి, పత్తి, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలను సాగు చేస్తారు. ఈ క్రమంలో నైరుతి వర్షపాత విస్తరణ, వానలు పడే సమయం అనేవి చాలా కీలకం.

## ప్రభుత్వ ఏర్పాటుకు అన్నాడీఎంకేను పిలవండి!

**గవర్నర్‌కు ఏఎంఎంకే అధినేత దినకరన్ లేఖ**

**చెన్నై, మే 8**




తమ పార్టీ తరపున ఎన్నికైన మన్నార్గుడి ఎమ్మెల్యే కామరాజ్ టీవీకేకు మద్దతిచ్చినట్లు మీడియాలో వచ్చిన వార్తలపై విచారణ జరపాలని 'అమ్మామక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే) అధినేత దినకరన్ గవర్నర్ అర్లేకర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి 9.50 గంటలకు గవర్నర్‌తో భేటీ అయిన దినకరన్.. తాము ఎన్‌డీఏ సీఎం అభ్యర్థిగా వున్న పళనిస్వామికి మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకే విఫలమైనందున.. పళనిస్వామిని ఆహ్వానించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు దినకరన్, కామరాజ్ సంతకాలు చేసిన లేఖను కూడా గవర్నర్‌కు అందజేశారు. అనంతరం లోక్‌భవన్ వెలుపల దినకరన్ మాట్లాడుతూ... శుక్రవారం సాయంత్రం విజయ్ గవర్నర్‌కు ఇచ్చిన ఎమ్మెల్యేల జాబితాలో తమ ఎమ్మెల్యే పేరు కూడా ఉన్నట్లు వెలువడిన వార్తలు చూసి గవర్నర్‌ను కలిశామన్నారు. ఒకవేళ విజయ్ నిజంగా గవర్నర్‌కు తమ ఎమ్మెల్యే లేఖ ఇచ్చినట్లయితే.. ఆ లేఖ ఫోర్జరీదైనా అయివుండాలి, లేదా ఆ ఎమ్మెల్యే డబ్బుకు అమ్ముడుపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశానన్నారు. ఇదిలా ఉండగా... అర్ధరాత్రి తన పార్టీ ఎమ్మెల్యే కామరాజ్‌తో కలిసి దినకరన్ మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లారు. తన మద్దతు అన్నాడీఎంకేకు మాత్రమే ఉంటుందని, టీవీకేకు మద్దతు ఇచ్చినట్లుగా ప్రచారంలో ఉన్న లేఖ నిజం కాదని ఎమ్మెల్యే స్వయంగా గవర్నర్‌కు వివరించారు.

## 6వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నాణ్యత ప్రమాణాలను పాటించాలి..**
**చైర్మన్ గోడిసెల సంధ్యారాణి**



**రామకృష్ణాపూర్, మే 08, (మన సమాజం):**
మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో సీసీ రోడ్డు పనులను చైర్మన్ గోడిసెల సంధ్యారాణి-రాజారమేష్ కౌన్సిలర్ మద్దెల శంకర్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ టియుఎఫ్ఐడిసి నుండి 6వ వార్డుకు సుమారు 88 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, దానిలో భాగంగానే భగత్ సింగ్ నగర్ ప్రైమరీ స్కూల్ నుండి శేషుపల్లి రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అలాగే మంజూరైన నిధుల నుండి డ్రైనేజ్, వీధి దీపాలు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులను మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, పల్లె రాజు, చంద్రమౌళి, రామిడి లక్ష్మీకాంత్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అభిమానుల కోసం స్పెషల్ అప్‌డేట్?



అగ్ర నటుడు ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ భారీ పానిండియా పౌరాణిక చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ ప్రచారంలో ఉన్నది. షణ్ముఖపురా ణంలోని ఓ కీలక ఘట్టం ఆధారంగా ఈ సినిమాను త్రివిక్రమ్ తెరకెక్కించనున్నట్టు తెలిసింది. ఈ సినిమాలో కుమార స్వామిగా ఎన్టీఆర్ కనిపిస్తారు. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ని త్రివిక్రమ్ ఇప్పటికే పూర్తి చేశారట. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ స్పెషల్ అప్‌డేట్ రానుందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఓ అనౌన్స్ మెంట్ వీడియోను కూడా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట.

కథ, కాన్సెప్ట్ గురించి ఈ వీడియోలో హింట్ ఇవ్వనున్నారట. హై విజువల్ ఎఫెక్ట్స్‌తో పవర్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ వీడియోను డిజైన్ చేస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ సినిమాతో ఎన్టీఆర్ బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక, తారక్ ఈ సినిమాపై దృష్టి పెట్టనున్నారు. నిజంగా తారక్ అభిమానుల్లో జోష్‌ని నింపే వార్త ఇది.

# అనుకున్నదొకటి జరిగిందొకటి!

నటి సమంతకు కథానాయికగా ఎంత క్రేజ్ ఉందో, ఫ్యాషన్ ప్రపంచంలో కూడా అంత క్రేజుంది. తాజాగా 'ది నోడ్' అనే మ్యాగజైన్ కవర్ పేజీ కోసం సమంత ఫొటో షూట్ చేసింది. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. సమంతలోని సరికొత్త ఎనర్జీని ఆవిష్కరించేలా ఈ ఫొటోలున్నాయి. వీటిలో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, సామ్ మేకోవర్ డిఫరెంట్‌గా ఉందని అంటున్నారు. ఇదిలావుంటే.. ఈ ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేస్తూ, తన కెరీర్ తొలినాళ్ల ముచ్చట్లను సమంత పంచుకున్నది. 'నాది ఓ ఊహించని సినిమా ప్రయాణం. అమ్మానాన్నకు మేం ముగ్గురం పిల్లలం. నేను చిన్నదాన్ని. అసలు నటిని కావాలనే ఆలోచనే నాకప్పట్లో లేదు. కాలేజ్ తర్వాత వచ్చిన చిన్న గ్యాప్‌లో సరదాగా మోడలింగ్ వైపు వెళ్లాను. ఈ క్రమంలోనే ఓ సినిమా ఆడిషన్‌కి వెళ్లి హీరోయిన్‌గా సెలక్టయిపోయాను. ఓ ఏడాది పాటు సినిమాలు చేసి, మళ్లీ కాలేజ్ కెళ్లి చదువుకుందాం అనుకున్నా. కానీ ఈ గ్లామర్ ప్రపంచం నన్నొదల్లేదు' అంటూ రాసుకొచ్చింది సమంత.

# స్వయంవర ఘట్టాల్లో రామాయణ



భారతీయ పౌరాణిక ఇతిహాసం రామాయణంలో సీతా స్వయంవర ఘట్టం అత్యంత విశిష్టమైనది. పరమశివుడి దివ్యాయుధం అయిన శివధనస్సుని విరిచి శ్రీరాముడు సీతాదేవిని సహధర్మచారిణిగా స్వీకరిస్తాడు. తాజాగా ప్రతిష్టాత్మక 'రామాయణ' చిత్రంలో భాగంగా సీతాస్వయంవర ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. రణబీర్‌కపూర్ రాముడిగా, సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తున్న ఈ చిత్రానికి నితేష్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ అగ్ర నటుడు యశ్ రావణుడి పాత్రను పోషిస్తున్నారు. దాదాపు 4000కోట్ల భారీ వ్యయంతో రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి తొలిభాగం విడుదలకానుంది. ప్రస్తుతం ముంబయి శివారు ప్రాంతంలోని ఫిల్మ్‌సిటీలో సీతా స్వయంవర ఘట్టాల కోసం మిథిలా నగర వైభవాన్ని పునఃసృష్టిస్తూ భారీ సెట్‌ను తీర్చిదిద్దారు. ప్రస్తుతం రావణ పాత్రధారి యశ్‌పై కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. సీతా స్వయంవరంలో పాల్గొన్న రావణుడు విల్లుని మోయలేక గర్వభంగం చెందే సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఇందులో యశ్ అభినయం పతాకస్థాయిలో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ తాజా షూటింగ్‌లో యశ్, సాయిపల్లవి పాల్గొంటున్నారు.

# 'టాక్సిక్'లో బోల్డ్ సీన్స్ వివాదం...

## కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్



కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి. అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె.. "నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైన పుకార్లే" అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది. ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, సినిమా కథపై కూడా ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో 'టాక్సిక్' వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది .